
RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 75 | పేజీలు : 4 | బుధవారం 16 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



ఏపీ తీరం దిశగా అల్పపీడనం..
ఉత్తరాంధ్రకు వర్ష సూచన

ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

శనివారం సాయంత్రానికి అల్పపీడనం ఏర్పాటుకు సూచనలు

ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశం

ప్రభావంతో వచ్చే వారం రాష్ట్రంలో వర్షాలు కురిసే ఛాన్స్

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారిక వెల్లడి

పర్యావరణ పరిరక్షణే ప్రధాన లక్ష్యం

తిరుమలలో 32 ఉచిత ఈవీ బస్సుల సేవలను ప్రారంభించిన చంద్రబాబు

టీటీడీకి ఈవీ బస్సులను విరాళంగా ఇచ్చిన రిలయన్స్, బయోటెక్

వాహన ఛార్జింగ్ స్టేషన్, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసిన రిలయన్స్

తిరుమల క్షేత్రంలో పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తులకు మరింత సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలను అందించేందుకు సిద్ధం చేసిన ఉచిత ఈవీ బస్సుల సేవలు బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల శుభసందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఉచిత ఎలక్ట్రిక్ బస్సులను తిరుమలలో ఘనంగా ప్రారంభించారు. పర్యావరణహిత రవాణా కోసం రిలయన్స్ సంస్థ 25 ఎలక్ట్రిక్ బస్సులను అందించగా, బయోటెక్ సంస్థ 7 బస్సులను టీటీడీకి ఉచితంగా అందజేసింది. బస్సులతో పాటుగా 'జియో-బీపీ' సహకారంతో ప్రత్యేక ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ స్టేషన్, ఇతర మౌలిక సదుపాయాలను రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేసింది. గత జూన్ నెలలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, తిరుమల కొండపై కాలుష్యాన్ని తగ్గించేందుకు టీటీడీకి రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా 25 ఈవీ బస్సులను విరాళంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు బస్సులు కొండపైకి చేరుకుని నేడు భక్తుల సేవలకు అందుబాటులోకి వచ్చాయి. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు మాడ వీధులు, కాటేజీలు మరియు దర్శన క్యూలైన్ల వద్దకు ఉచితంగా చేరుకోవడానికి ఈ బస్సులు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.




తిరుమలలో పవిత్ర భావం ఉండాలి..

రాజకీయాలకు వేదిక కాకూడదు

- "రాబోయే ఐదేళ్లూ.. నిర్వహణ బాధ్యత ట్రస్టుకే అప్పగిస్తున్నాం
- ప్రతి భక్తుడికి భద్రత ఇచ్చేందుకు ఎల్ఐసీ తరఫున రూ.2 లక్షల బీమా అందిస్తున్నాం
- ఆధార్ ఆధారిత పేపర్‌లెస్ క్లెయిమ్ తీసుకొచ్చాం
- తిరుమలలో పవిత్ర భావం ఉండాలి. రాజకీయాలకు వేదిక కాకూడదు.

అంతా అబద్ధం..

- రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్
- ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని సవాల్
- తనతో పాటు పలువురి ఆస్తులపైనా సీబీఐ విచారణకు డిమాండ్
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఎదురుదాడి
- గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని కవిత విమర్శ
- ముఖ్యమంత్రిపై తమకు నమ్మకం లేదని వ్యాఖ్య



హైదరాబాద్


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు - మిగతా3లో

రేపల్లె నేత మోపిదేవి శ్రీనివాసరావును సస్పెండ్ చేసిన జగన్

ఐదు నెలల క్రితమే వైసీపీలో చేరిన శ్రీనివాసరావు

బాపట్ల జిల్లా పార్టీలో గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారని ఆరోపణలు

గత ఎన్నికల్లో రేపల్లె నుంచి ఓడిపోయిన శ్రీనివాసరావు



తెలంగాణలో స్కూళ్లకు దసరా సెలవులు

తెలంగాణలో పాఠశాలలకు అసెస్‌మెంట్-1 పరీక్షల షెడ్యూల్ విడుదల

అక్టోబర్ 1 నుంచి 9 వరకు సమ్మేటివ్-1 పరీక్షలు

అక్టోబర్ 10 నుంచి 22 వరకు దసరా సెలవులు

వివిధ తరగతులకు వేర్వేరు సమయాల్లో పరీక్షల నిర్వహణ

పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తాం

- 22ఏ భూములపై గుడ్‌న్యూస్..
- సీఎం రేవంత్ కీలక హామీలు
- 22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించినట్లు సీఎం వెల్లడి
- యూఎల్‌సీ భూములపై త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని ప్రకటన
- పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని హామీ
- క్రమబద్ధీకరించిన, వేలం భూములకు 22ఏ నుంచి విముక్తి కల్పిస్తామన్న రేవంత్



హైదరాబాద్

22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. జీవో 166, జీవో 59, జీవో 58 కింద క్రమబద్ధీకరించిన భూములకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. వేలంలో కొనుగోలు చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల - మిగతా3లో

వివేకా హత్య కేసు నిందితులకు సీబీఐ కోర్టులో ఎదురుదెబ్బ

- డిశ్చార్జ్ పిటిషన్లు వేసిన గంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి
- పిటిషన్లకు విచారణార్హత లేదన్న కోర్టు
- నిందితులపై అభియోగాలు విచారణకు అర్హమైనవేనని స్పష్టీకరణ

హైదరాబాద్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో నాంపల్లిలోని ప్రత్యేక సీబీఐ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. తమపై నమోదైన తీవ్ర అభియోగాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ ప్రధాన నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లను న్యాయస్థానం నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. కేసులో ఏ1 ఎర్ర గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్ రెడ్డి, ఏ6 గజ్జల ఉదయ్ - మిగతా3లో

బుధవారం 16 సెప్టెంబర్ 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

బలిజల తరఫున... అనంత మేయర్ సీటు నాకు ఇవ్వండి.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు బయోడేటా అందజేసిన రాయల్ మురళి.

అనంతపురం డెస్క్ సెప్టెంబర్ 16 సీమ వార్త సాయంత్రం.



తిరుమలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు తెలుగుదేశం పార్టీ నేషనల్ ప్రెసిడెం ట్ నారా చంద్రబాబునాయుడు ను మాజీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి కలిశారు. ఈ సందర్భంగా రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో అనంతపురం నగరపాల క సంస్థ ఎన్నికల్లో బలిజ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రాయల్ మురళీమో హన్ తన బయోడేటా పరిశీలించాలని ని ముఖ్యమంత్రి కి అందజేసి 36 సంవత్సరాల నుండి తెలుగు పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్నాననితెలిపారు.ఈ ఎన్నికల్లో కచ్చితంగా మేయర్ స్థానానికి టికెట్ ఇవ్వాలని కోరడమైనది





కోట జనానికి కోట్లు!!

పెనుగొండ కోటలో .....గల్లీ జనం మధ్య సవిత...!!

...అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా.

కక్ష సాధింపు రాజకీయాలు మా విధానం కాదు

సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం అమలు చేశాం

మున్సిపాలిటీలో... 20 కోట్లతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

పెనుకొండ మున్సిపాలిటీలోని... 17, 18వ వార్డుల్లో పర్యటించిన మంత్రి సవిత







భక్తి ముసుగులో.... నకిలీ గంధం దందా...!!

.....యల్లనూరులో 4 టన్నుల గంధం పొడి పట్టివేత

.....భక్తమండలి హెచ్చరికతో అప్రమత్తమైన పోలీసులు

....జైశ్రీరామ్ భక్తమండలి పోరాటం ఫలించింది





యల్లనూరు/తాడిపత్రి సెప్టెంబర్ 16 సాయంత్రం:

భక్తి పేరుతో సాగుతున్న గంధం పొడి దందాపై జైశ్రీరామ్ భక్తమండలి చేస్తున్న పోరాటం ఫలించింది.తాడిపత్రి పట్టణంలో ఈ నెల 18న జరగనున్న సామూహిక వినాయక నిమజ్జనోత్సవాల్లో గంధం పొడి వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, యాడికి, ఎల్లనూరు కేంద్రాలుగా విక్రయాలు సాగుతున్నాయని భక్తమండలి అధ్యక్షుడు నిచనమెట్ల రాధాకృష్ణ సెప్టెంబర్ 12న అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. - మిగతా3లో

పండుగ భక్తిని చాటాలి... డిజె శబ్దాన్ని కాదు..!"

.....హిందూపురం గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలవాలి.

.....భక్తి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ప్రశాంతంగా నిమజ్జనాలు నిర్వహించాలి.

..... హిందూపురంలో...జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్

పౌష్టిక ఆహారం... వ్యక్తి ఆరోగ్యానికి పునాది..!!

.....సోమందేపల్లి ప్రాజెక్టు పరిధిలో... ఘనంగా 9వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం.

.....ముఖ్య అతిథిగా హాజరైన పిడి డాక్టర్ ప్రమీల

సోమందేపల్లి: సెప్టెంబర్ 16 సీమ వార్త సాయంత్రం.





సమాజంలో పోషకాహారంపై అవగాహన పెంపొందించి, ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో 9వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం కార్యక్రమాన్ని సోమందేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం సోమందేపల్లి సీడీపీఓ డాక్టర్ శాంత లక్ష్మి అధ్యక్షతన నిర్వహించబడింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్యసాయి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ప్రమీల , సోమందేపల్లి మండల తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ , ఏపీఎం , పీహెచ్ఎన్ పార్వతమ్మ హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమీల మాట్లాడుతూ పోషకాహారం ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి పునాది అని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు మరియు మహిళలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు.శరీర ఎదుగుదలకు, కండరాల నిర్మాణానికి, కణజాలాల అభివృద్ధికి మరియు శరీరంలో దెబ్బతిన్న కణజాలాల పునరుద్ధరణకు ప్రోటీన్ ఎంతో ముఖ్యమైన పోషక పదార్థమని పీడీ గారు వివరించారు. పిల్లల శారీరక ఎదుగుదలతో పాటు మెదడు అభివృద్ధికి కూడా తగిన పోషకాహారం అవసరమని తెలిపారు. పప్పులు, కందులు, పెసలు, శనగలు, మినుములు, సోయా వంటి పప్పుధాన్యాలు, పాలు మరియు పాల పదార్థాలు, వేరుశెనగ, బాదం, ఇతర గింజలు వంటి స్థానికంగా లభించే ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో తగిన మోతాదులో చేర్చుకోవాలని సూచించారు. అదేవిధంగా కేవలం ఒకే రకమైన ఆహారంపై ఆధారపడకుండా బియ్యం లేదా చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పాలు మరియు ఇతర పోషక పదార్థాలతో సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు.గర్భిణీలు తమ ఆరోగ్యంతో పాటు గర్భంలోని శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం తీసుకోవాలని, బాలింతలు తగినంత పోషకాహారం తీసుకుంటూ శిశువుకు తల్లిపాలు అందించాలని సూచించారు. చిన్నారులకు వయస్సుకు తగిన విధంగా వివిధ రకాల పోషకాహారాన్ని అందించడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని తెలిపారు. పిల్లలకు అధికంగా ప్యాకేజ్డ్ ఫుడ్, జంక్ ఫుడ్, అధిక ఉప్పు, చక్కెర కలిగిన ఆహార పదార్థాలు ఇవ్వకుండా ఇంట్లోనే తయారు చేసే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అలవాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు వివిధ రకాల పోషకాహార వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్థానికంగా సులభంగా లభించే పదార్థాలతో తక్కువ ఖర్చుతో తయారు చేయగలిగే పోషకాహార వంటకాలను ప్రదర్శించి, వాటిలో ఉండే పోషక విలువలను మహిళలకు వివరించారు. ప్రతి కుటుంబం తమ రోజువారీ ఆహారంలో వైవిధ్యాన్ని పాటించి, “సమతుల్య ఆహారం -- సంపూర్ణ ఆరోగ్యం” అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో సోమందేపల్లి ప్రాజెక్టు సూపర్వైజర్లు శుభారాణి, నాగరాణి, లలితమ్మ, మంజుల, సోమందేపల్లి మరియు పరిగి మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, అంగన్వాడీ సహాయకులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

సీమ వార్త సాయంకాలం
బుధవారం 16
సెప్టెంబర్ 2026

పండుగ భక్తిని చాటాలి... డిజె శబ్దాన్ని కాదు..!"





హిందూపురం సెప్టెంబర్ 16వ సీమ వార్త సాయంత్రం. హిందూపురం గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలవాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ గారు అన్నారు. హిందూపురంలోని సాయితేజ ఫంక్షన్ హాల్‌లో బుధవారం గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై పోలీసుల ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ సమితుల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్ పాల్గొని ఉత్సవ కమిటీ సభ్యులు, యువతకు పలు సూచనలు చేశారు. హిందూపురంలో సాధారణంగా 11వ రోజు నిర్వహించే గణేష్ నిమజ్జనాలను ఏడవ రోజుకే నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు, ప్రజలు సమన్వయంతో నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. హిందూపురంతో పాటు పుట్టపర్తి, పెనుకొండ ప్రాంతాల్లోనూ నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభమైన నేపథ్యంలో బందోబస్తు కోసం హిందూపురం నుంచి అదనపు పోలీసు బలగాలను ఇతర ప్రాంతాలకు పంపించినట్లు తెలిపారు. కదిరి నుంచి కూడా సిబ్బందిని అవసరమైన ప్రాంతాలకు కేటాయించినట్లు వెల్లడించారు. నిమజ్జనాలు 11వ రోజు, 15వ రోజు, 18వ రోజు, 21వ రోజు వరకు కొనసాగితే పోలీసు సిబ్బందికి కుటుంబాలతో గడిపేందుకు, వ్యక్తిగత పూజలు చేసుకునేందుకు కూడా సమయం దొరకని పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ప్రజల భద్రత కోసం పోలీసులు తమ వ్యక్తిగత సమయాన్ని పక్కనపెట్టి విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ప్రస్తుతం సమాజంలో జనరేషన్ గ్యాప్ కారణంగా యువతతో కమ్యూనికేషన్‌లో కొన్ని సమస్యలు ఏర్పడుతున్నాయని ఎస్పీ గారు తెలిపారు. 16 నుంచి 26 సంవత్సరాల మధ్య వయసున్న యువతకు పెద్దలు తమ అనుభవాల ద్వారా చెప్పే విషయాలను పూర్తిగా అర్థమయ్యేలా వివరించాల్సిన అవసరం ఉందన్నారు.మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా ప్రభావంతో యువతకు ప్రత్యేకమైన ప్రపంచం ఏర్పడిందని, ఉత్సవ కమిటీల్లోని పెద్దలు యువతతో స్నేహపూర్వకంగా మాట్లాడి పండుగ నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను వివరించాలని ఎస్పీ గారు సూచించారు.పెద్దలు, యువత కలిసి పనిచేస్తే హిందూపురం గణేష్ ఉత్సవాలు రాబోయే సంవత్సరాల్లో మరింత ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించుకోవచ్చని అన్నారు. హిందూపురంలో గణేష్ నిమజ్జనాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తారని విన్నానని, ఈసారి ప్రత్యక్షంగా చూసే అవకాశం రావడం సంతోషంగా ఉందని ఎస్పీ తెలిపారు. నిమజ్జన వేదుకల్లో డీజేలకు అధిక ప్రాధాన్యత ఇవ్వకుండా సంప్రదాయ కళాకారులు, కళారూపాలను ప్రోత్సహించాలని యువతకు సూచించారు. అధిక శబ్దం వల్ల వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, ప్రజల ప్రశాంతతకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్ల వినియోగానికి అనుమతి లేదని, శబ్ద తీవ్రత కూడా నిర్దేశిత పరిమితుల్లోనే ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు."పండుగ అనేది భక్తిని చాటాలి.. డీజే శబ్దాన్ని కాదు" అనే సందేశంతో యువత సంప్రదాయాలను గౌరవిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా నిమజ్జన మార్గాలు ఎంచుకోవాలి హిందూపురంలోని బాబుజీ నగర్, అంబేద్కర్ నగర్, గరిడి ప్రాంతాలతో పాటు పేట రంగస్వామి దేవాలయం వద్ద రహదారులు ఇరుకుగా ఉన్నందున భారీ విగ్రహాల నిమజ్జన ఊరేగింపులకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలని కోరారు. సాయంత్రం వేళ విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తకుండా ప్రతి విగ్రహం సాయంత్రం 5 గంటలలోపు ప్రధాన రహదారికి చేరుకునేలా యువత ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు కేవలం వినోదానికి పరిమితం కాకుండా భక్తి, సంప్రదాయం, సంస్కృతి, సామాజిక ఐక్యతను చాటేలా ఉండాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.హిందూ పురంలో నిర్వహించే గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతత, క్రమశిక్షణ, సంప్రదాయ పరిరక్షణ, ప్రజా భద్రతలో ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు రావాలని ఎస్పీ కోరారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్ , సీసీ, డ్రోన్ కెమెరాల పనితీరును పరిశీలించి నిమజ్జన సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు , బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు, ఏఎస్పి కెవి మహేష్ , ఆర్టీవో కరుణ సాగర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, సీఐలు ఆంజనేయులు, అబ్దుల్ కరీం, జనార్ధన్ ,ప్రసాద్ బాబు, ఇస్మాయిల్, ఎస్ఐలు, కమిటీ నిర్వాహకులు యువకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఉన్నతాధికారులను కలిసిన..... ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు.





కదిరి సెప్టెంబర్ 16 సీమ వార్త సాయంత్రం. గత నెల 26వ తేదీన ఎన్జీవో హోం లో ఏర్పాటు చేయబడిన ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం కదిరి డిపో కమిటీ వారు బుధవారం కమిటీ పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది డిపో ఉన్నతాధికారులు డిపో మేనేజర్ శ్రీ డి రమణయ్య ని అలాగే సీనియర్ ట్రాఫిక్ ఇంచార్జ్ శ్రీ బి పెద్దన్న ని గ్యారేజ్ ఇంచార్జ్ శ్రీ ఎస్ వెంకటప్ప సార్ ని అలాగే సెక్యూరిటీ ఇంచార్జ్ శ్రీ రామలింగేశ్వర ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించడం జరిగినది అలాగే అధ్యక్షుడు పి శంకరప్ప మాట్లాడుతూ ఉద్యోగుల యొక్క సమస్యలను సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు సెక్రెటరీ పి సురేంద్ర మాట్లాడుతూ సంస్థ అభివృద్ధి కోసం మా వంతు సహాయ సహకారం అందిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారు జి రామకృష్ణ వర్కింగ్ ప్రెసిడెంట్ డి లక్ష్మీనారాయణ వైస్ ప్రెసిడెంట్ విజయశ్రీ ఎస్.వి రత్నం డివి రమణ జాయింట్ సెక్రెటరీ ఎస్ కన్యాకుమారి లక్ష్మీ దేవమ్మ ఎన్ఎస్ రావు గ్యారేజ్ నాయకులు పురుషోత్తం గంగన్న మల్లికార్జున డిపో ట్రెజరర్ హరికుమార్ ప్రచార కార్యదర్శి ఎస్ అనిల్ సిహ కమిటీ నాయకులు పి శివయ్య రాజకుమార్ అధిక సంఖ్యలో కమిటీ నాయకులు మరియు ఉద్యోగులు పాల్గొనే కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

రెండో విడత తల్లికి వందనం ఎక్కడ?

నెలలు గడుస్తున్నా ఖాతాల్లో జమకాని రూ.13 వేలు

సాంకేతిక కారణాల పేరుతో జాప్యం

తాడిపత్రి, సెప్టెంబర్ 15 సాయంత్రం : తల్లికి వందనం పథకం రెండో విడత కోసం రాష్ట్రవ్యాప్తంగా 3,29,201 మంది తల్లులు ఎదురుచూపులు చూస్తున్నారు. రూ.13 వేల చొప్పున మొత్తం రూ.493 కోట్లు విడుదల కావాల్సి ఉంది. 1వ తరగతిలో కొత్తగా చేరిన విద్యార్థులు, ఇంటర్ ఫస్టియర్ లో చేరిన వారు, అలాగే తొలి విడతలో ఆధార్ మిస్ మ్యాచ్, బ్యాంక్ అకౌంట్ తప్పులు, కేవైసి పెండింగ్ వంటి సాంకేతిక కారణాలతో డబ్బులు పడని వారికి తల్లికి వందనం ఇవ్వాల్సి ఉంది.

ఆగస్టు 30 హామీ బకాయి

ఆగస్టు 30 నాటికి ఖాతాల్లో జమ చేస్తామని కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వ అధికారులు హామీ ఇచ్చారు. కానీ సెప్టెంబర్ సెకండ్ వీక్ దాటినా ఇప్పటివరకు ఒక్క ఖాతాలో కూడా డబ్బులు పడలేదు.

తల్లుల ఆవేదన

"బడులు తెరిచి మూడు నెలలు అవుతోంది, పిల్లలకు పుస్తకాలు కొనడానికి, ఫీజులు కట్టడానికి అప్పులు చేయాల్సి వస్తోంది. సచివాలయానికి వెళ్తే సర్వర్ ప్రాబ్లమ్ అంటున్నారు" అని అంబేద్కర్ నగర్ కు చెందిన ఓ తల్లి రామాంజులమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం వెంటనే సాంకేతిక సమస్యలు పరిష్కరించి రెండో విడత నిధులు విడుదల చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

తాలూకాలోని అన్ని చెరువులకు నీరు విడుదల చేయాలి: రైతు సంఘం పూజారప్ప డిమాండ్.




పావగడ సెప్టెంబర్ 16 సీమవార్త సాయంత్రం. పావగడ:: తాలూకా తీవ్ర కరువు ప్రాంతంగా మారిందని, 80 శాతం బోర్‌వెల్స్ ఎండిపోయి రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం తుమకూరు జిల్లా అధ్యక్షుడు పూజారప్ప తెలిపారు. పట్టణంలోని నిరీక్షణా మందిరంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు., తాలూకాలోని చెరువులు నీరు లేక ఎండిపోయాయని, పశువులు, పక్షులకు కూడా తాగునీరు లేని పరిస్థితి నెలకొందన్నారు. భద్రా ఎగువ ప్రాజెక్టు కోసం నిరంతరం పోరాటం చేసినా పనులు నిదానంగా సాగుతున్నాయని, పావగడ, చిక్కనాయకనహళ్లి, శిరా సహా తుమకూరు జిల్లాలోని 10 తాలూకాల్లో నీటి కొరత ఉందని, వెంటనే భద్రా ఎగువ, హేమావతి మరియు ఎత్తినహొళె నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూమి లేని రైతులకు అక్రమ-సక్రమ పథకం కింద భూములు మంజూరు చేయించడానికి మాజీ వ్యవసాయ శాఖ మంత్రి కృష్ణ బైరేగౌడ మరియు సబ్ డివిజనల్ అధికారి వరకు వెళ్లి ఆదేశాలు తెప్పించినా, తహశీల్దార్ కార్యాలయ అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. తాలూకాలోని కొన్ని గ్రామాల్లో సోలార్ కంపెనీలు రైతుల పొలాలకు వెళ్లే మ్యాప్ రోడ్లను పూర్తిగా మూసేశారని . ఎన్నిసార్లు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేరుశనగ, కంది పంటలు ఎండిపోయాయని, వెంటనే పంట నష్టాన్ని ప్రకటించి పరిహారం ఇవ్వాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని, తుంగభద్రా తాగునీటిని పావగడ, తిరుమణి, వై.ఎన్.హోసకోటె, నిడగల్ హోబళీలకు సరఫరా చేయాలని, పళవళ్లి, భూపూరు, బి.కె.హళ్లి ప్రాంతంలో హైటెన్షన్ వైర్లకు మూడు రెట్లు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాలూకా అధ్యక్షుడు శివు మాట్లాడుతూ, తహశీల్దార్ కార్యాలయ అధికారులు రైతులతో మర్యాదగా ప్రవర్తించాలని, అనవసరంగా తిప్పుకోకుండా పనులు చేసి పెట్టాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే అన్ని ప్రగతిశీల సంఘాలతో కలిసి తీవ్ర పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా తాలూకా కార్యదర్శి చిక్కన్న, నాయకులు గోపాల్, ముత్తప్ప, శ్రీరామప్ప, సదాశివప్ప, హనుమంతరాయ, గుడిపల్లప్ప, ఈరణ్ణ, దుర్గప్ప, మార్జన్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ మల్లికార్జున రెడ్డికి సన్మానం

యువకులు..ఎస్పై ను ఆదర్శంగా తీసుకోవాలి

ఘనంగా ఎస్పై జన్మదిన వేడుకలు

జనసేన... కొండబోయిన సతీష్



ఓబులదేవరచెరువు (సెప్టెంబర్16)సీమవార్త: గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించే దిశగా ప్రయత్నం చేస్తున్న ఎస్పై మల్లికార్జున్ రెడ్డి ని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని జనసేన పార్టీ నాయకులు కొండబోయిన సతీష్ పిలుపునిచ్చారు.చట్ట వ్యతిరేక చర్యలను అరికడుతూ.... విధుల్లో నిబద్ధత చూపుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఎస్ఐ మల్లికార్జున రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని జనసేన నాయకులు సతీష్ కొండకమర్ల వైయస్సార్ సర్కిల్లో మంగళవారం సన్మానం చేసి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐకి పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పలువురు జనసేన నాయకులు, యువకులు,స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని మండల వ్యాప్తంగా ఎస్పై చేస్తున్న విధుల సేవలపై ప్రశంసించారు. అలాగే కార్యక్రమంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో కొండబోయిన సతీష్ తో పాటు యువకులు దామోదర్,గంగరాజు, అనిల్,సాయి,వినోద్ తదితర నాయకులు, కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కోట జనానికి కోట్లు...!!

పెనుకొండ సెప్టెంబర్ 16 సీమ వార్త సాయంత్రం.

నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర చేనేత మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రి, పెనుకొండ నియోజకవర్గ శాసనసభ్యురాలు సవితమ్మ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 26 నెలల కాలంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు.పెనుకొండ మున్సిపాలిటీ లో 17, 18వ వార్డుల్లో మంత్రి సవితమ్మ పర్యటించారు. ఈ సందర్భంగా 35 సంవత్సరాలుగా ఉన్న డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయడంతో స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలో సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడంతో స్థానికులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రయాణికుల సౌకర్యార్థం అంబేద్కర్ సర్కిల్‌లో సొంత నిధులతో ఏర్పాటు చేసిన నూతన బస్ షెల్టర్‌ను మంత్రి పరిశీలించారు. బస్ షెల్టర్‌ను ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం జూనియర్ కళాశాల మైదానాన్ని మంత్రి పరిశీలించారు. కాలేజీ గ్రౌండ్‌లో ఉన్న సమస్యలు, అభివృద్ధి చేయాల్సిన అంశాలపై అధికారులతో చర్చించారు. విద్యార్థులు, యువతతో పాటు ప్రజలకు ఉపయోగపడేలా మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన 1,200 కుటుంబాలకు ఇంటి పొజిషన్ పత్రాలు అందించేందుకు చర్యలు చేపట్టామని, స్థలం ఉన్న అర్హులైన కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి ఇప్పటికే ?20 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే ఆయా నిధులతో అభివృద్ధి పనులను చేపడతామని మంత్రి సవితమ్మ తెలిపారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు."కేసులు పెట్టడం మా నైజం కాదు.. కక్ష సాధింపు రాజకీయాలు చేయడం మా విధానం కాదు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ నాయకులు, అప్పటి మంత్రులు తమ సొంత కార్యకర్తలపైనా కేసులు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. మేము మాత్రం కక్ష సాధింపు రాజకీయాలకు దూరంగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తున్నాం" అని మంత్రి సవితమ్మ స్పష్టం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం హామీలను అమలు చేశామని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.మేము చేసిన అభివృద్ధి పనులను ప్రజల ముందుంచి, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలను అడుగుతాం. ప్రజల కోసం చేసిన పనులే మా బలం. ప్రజలకు సేవ చేయడమే మా లక్ష్యం అని మంత్రి సవితమ్మ పేర్కొన్నారు. నియోజకవర్గంలో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి ముసుగులో....నకిలీ గంధం దందా...!!


-మొదటిపేజీ తరువాయి

తాడిపత్రిలోనే నిషేధం విధించి చేతులు దులుపుకోవడం కాకుండా చుట్టుపక్కల మండలాల్లోనూ విక్రయాలు అరికట్టాలని కోరారు.ఆయన హెచ్చరికతో అప్రమత్తమైన పోలీసులు యల్లనూరు మండల కేంద్రంలోని పలు కిరాణా షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఎస్ఐ రామాంజనేయరెడ్డి దాడులు నిర్వహించి బిల్లులు, అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన 4 టన్నుల గంధం పొడిని స్వాధీనం చేసుకుని కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు అప్పగించారు. గంధం పొడిలో ప్రమాదకర రసాయనాలు ఉండటం వల్ల చిన్నపిల్లలు, భక్తులకు చర్మ వ్యాధులు, కళ్ల మంటలు, శ్వాస సమస్యలు వస్తున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కూడా ఇదే తరహాలో పట్టుబడినా కేవలం సీజ్ తోనే సరిపెట్టారని, ఈసారి మూలాల్లోకి వెళ్లి ప్రధాన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తమండలి డిమాండ్ చేస్తోంది.

బీసీ కాలనీలో ఘనంగా లంబోదర వినాయక చవితి వేడుకలు

రజక యువకుల ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు కొనసాగనున్న ఉత్సవాలు

చిరునవ్వుతో భక్తులను ఆకట్టుకుంటున్న గణనాథుడి అలంకరణ



పుట్టపర్తి, సెప్టెంబర్ 16 (సీమవార్త సాయంకాలం బ్యూరో) : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి బీసీ కాలనీలో రజక యువకులంతా కలిసి లంబోదర వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. యువకులు చందాలు వేసుకుని ఎంతో భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పుట్టపర్తి పట్టణంలో మూడు రోజులకే అనుమతి ఉండటంతో పలు మండపాల్లోని గణనాథులు బుధవారం నిమజ్జనానికి తరలివెళ్లారు. అయితే ఇక్కడ ఐదు రోజుల వరకు అనుమతి లభించడంతో వేడుకలు మరో రెండు రోజులు కొనసాగనున్నాయి. తెల్లని ధోతి ధరించి, మెడలో రంగురంగుల పూలమాలలు, శిరస్సుపై కిరీటంతో దర్శనమిస్తున్న గణనాథుడు చిరునవ్వుతో భక్తులను ఆశీర్వదిస్తున్నట్లు కనిపిస్తున్నాడు. చేతుల్లో గద తదితర ఆయుధాలు ధరించి, అభయ ముద్రతో కొలువుదీరిన స్వామి రూపం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రవేశ ద్వారం పైన లంబోదర వినాయకుడి చిత్రపటం, ఇరువైపులా నాట్య గణపతి రూపాలు, ఎరుపు తెరలు, విద్యుత్ దీపాల అలంకరణతో మండపం రాత్రివేళ కన్నుల పండుగగా కనిపిస్తోంది. ఉదయం ప్రత్యేక పూజలు, గణపతి హోమం, సాయంత్రం భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో యువకులు ఉత్సవాలను ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. వారి ఐక్యత, కృషిని స్థానికులు, భక్తులు ప్రశంసిస్తున్నారు.

గణపతి పప్పా.... మోరియా

లిగాజుగుంటపల్లిలో ఘనంగా గణేష్ నిమజ్జనం

ఓబులదేవరచెరువు

(సెప్టెంబర్17)సీమవార్త సాయంత్రం: గాజుగుంటపల్లిలో వినాయక చవితి నిమజ్జనం బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యువకులు గణపతి పప్పా...మోరియా అంటూ చేసిన నినాదాలు గ్రామంలో మారు మ్రోగాయి. ఉదయం నుంచి స్థానికంగా ఉన్న వినాయక విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. యువకులు,మహిళలు, పెద్దవారు అనే తేడా లేకుండా గ్రామంలో అందరూ నృత్యాలు, భజనలు చేస్తూ ఒకరిపై ఒకరు కలర్లు చల్లుకుంటూ ఆనందంగా నిమజ్జన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో విగ్రహానికి ఊరేగింపు చేశారు.అనంతరం ముత్యాల చెరువు కు వెళ్లి నిమజ్జనం కార్యక్రమం చేశారు.ఈ కార్యక్రమంలో అర్చకులు,మండప నిర్వాహకులు,స్థానిక ప్రజలు,యువకులు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం

బుధవారం 16
సెప్టెంబర్ 2026

పులివెందులలో... 32 వ సారి బలిజ వినాయకుడు.

బలిజ సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వినాయక విగ్రహ ఉత్సవాలు.



పులివెందల సెప్టెంబర్ 16 సీమ వార్త సాయంత్రం. పులివెందుల పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం యూత్ ఆధ్వర్యంలో స్థానిక బలిజ సంఘం కార్యాలయం నందు 32వ సంవత్సరం శ్రీ విఘ్నేశ్వర స్వామివారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి సంవత్సరం కన్నుల పండుగగా జరిగే ఈ వినాయకుని ఉత్సవాల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తూ, ప్రత్యేక అలంకరణలతో మరియు కోలాటాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించడం జరుగుతుంది."బలిజ సంఘం వినాయకుడు" అనే ప్రత్యేకతతో ప్రతి సంవత్సరం ఈ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడుతున్నాయి. ఈ వినాయకుని ఉత్సవాలను బలిజ సంఘం యూత్ నాయకులు తోటంశెట్టి సుధాకర్, పాలెం శంకర్ నాయుడు, ఐటీఐ సాయి, దాసరి కార్తీక్ వారి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం విజయ వంతంగా నిర్వహిస్తున్నారు.

మంత్రి సత్య కుమార్‌కు"లక్కీ" దీవెనలు.

గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సతీష్ కుమార్ జన్మదిన వేడుకలు.

బిజెపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ అధ్వర్యంలో సేవా కార్యక్రమాలు.

పాల్గొన్న టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్.





గోరంట్ల సెప్టెంబర్ 16 సీమ వార్త సాయంత్రం. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని గోరంట్ల పట్టణం లో మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు బోయ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.గోరంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో భారతీయ జనతా పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన మంత్రి సత్య కుమార్ జన్మదిన వేడుకలకు టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్, డాక్టర్ వినోద్ లు ముఖ్యఅతిదులు గా హాజరయ్యారు. మంత్రి సత్తి కుమార్ జన్మదిన వేడుకల్లో భాగంగా ప్రత్యేకంగా తయారు చేసిన కేకును ఆసుపత్రి ఆవరణలో కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రేడ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అజంతుల్లా, ఉత్తమ రెడ్డి, షబ్బీర్, నాగరాజు యాదవ్, మార్కెట్ యాడ్ డైరెక్టర్ రామాంజనమ్మ, కొర్రు ఆంజనేయులు, వెంకటాచలం, శంకర్ రెడ్డి, అశోక్, గుంటి పల్లి చంద్ర, నాగేష్, జయరాం నాయక్, బాలు, ముంతాజమ్మ, లక్ష్మి దేవమ్మ, పార్వతి భాయ్, సాయినాథ్ రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నరు.

సొంతూరి భక్తులకు.. డమ్స్ సెట్

బహుకరించిన ఆదర్శ రైతు గంగాధర్ రెడ్డి.

....దాత గంగాధర్ రెడ్డిని సన్మానించిన గ్రామస్తులు.



గోరంట్ల సెప్టెంబర్ 16 సీమ వార్త సాయంత్రం. గ్రామంలో జరిగే దైవ కార్యక్రమాల ఊరేగింపుకు ఉపయోగపడే విధంగా గ్రామస్తుల కోరిక మేరకు డమ్స్ సెట్ ను కొనుగోలు చేసి గ్రామస్తులకు బహుకరించాడు ఆదర్శ రైతు గంగాధర్ రెడ్డి. మండలంలోని కొండాపురం పంచాయతీ పరిధిలోని రాగిమాకులపల్లి గ్రామంలో వినాయకచవితి సందర్భంగా గ్రామస్థుల కోరిక మేరకు గ్రామానికి చెందిన యం గంగాధరరెడ్డి వినాయక పూజా మండలికి తన సొంత ఖర్చులతో .డ్రమ్స్ . కొని యివ్వడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు గంగాధరరెడ్డి ని రమేష్ చెప్తే నేనింతేగాని ఘనంగా సన్మానించారు.



గోరంట్ల మండలంలో పెరిగిన.... 9 పోలింగ్ బూత్‌లు

ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం.

అభ్యంతరాలు స్వీకరించిన ఎంపీడీవో కమల భాయ్.



గోరంట్ల సెప్టెంబర్ 16 సీమ వార్త సాయంత్రం. రాబోవు ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా పలు ఎంపీటీసీల పరిధిలో 9 పోలింగ్ బూత్ లు పెరిగినట్లు ఎంపీడీవో కమల భాయ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీవో కమల భాయ్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్ ల ముసాయిదా జాబితా ప్రచురణ నిర్వహించారు. ఈ నేపథంలో రాజకీయ పార్టీల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో కమల భాయ్ మాట్లాడుతూ రాబోవు ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో గోరంట్ల మండలంలోని మందలపల్లి, గౌని వారి పల్లి, కొండాపురం, కమ్మవారి పల్లి, గోరంట్ల 3 వ మరియు 6 వ ఎంపీటీసీ పరిధిలో ఒక్కో పోలింగ్ బూత్ లు, బూదిలి, వడిగేపల్లి ఎంపీటీసీల పరిధిలో 9 పోలింగ్ బూత్ లు పెంచినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మధు నాయక్, టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, వైసిపి కన్వీనర్లు మేదర శంకర, వెంకటేష్, బిజెపి కన్వీనర్ లక్ష్మీనారాయణ, జనసేన కన్వీనర్ సంతోష్ నాతోపాటు హస్తకళ స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్, నిమ్మల శ్రీధర్, సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాల చెరువు చంద్ర,నాగే నాయక్, జయరాం, జనసేన జిల్లా కార్యదర్శి సురేష్, గోవిందప్ప, చౌడేశ్వరి కాలనీ శ్రీనివాసులు, శ్రీరాములు, గాజుల రమేష్, శ్రీశైలం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యన్న జన్మదిన వేడుకల్లో... సత్యన్న సేవకులు.

గోరంట్ల ప్రభుత్వాసుపత్రిలో సంబరాలు చేసుకున్న... సత్యన్న సేవా సంస్థ సభ్యులు.





గోరంట్ల సెప్టెంబర్ 16 సీమ వార్త సాయంత్రం. మంత్రి సత్య కుమార్ పేరిట ఏర్పాటు చేసి అనేక సేవలందిస్తున్న సత్యన్నా సేవా స్వచ్ఛంద సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో గోరంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మంత్రి సత్య కుమార్ జన్మదిన పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సత్య కుమార్ జన్మదినం సందర్భంగా గోరంట్ల పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి లో మంత్రి చదివిన కాలేజ్ జిఎంఆర్ మదనపల్లి మిత్రులు మరియు స్థానిక సత్యన్న సేన సభ్యులు కలసి అన్న దాన కార్యక్రమం నిర్వహించి న ఈ కార్యక్రమాన్ని డాక్టర్ వినోద్ ప్రారంభించగా... సత్య కుమార్ మిత్రులు మాట్లాడుతూ దశబ్దాలు గా మిగిలి పోయిన ఆసుపత్రి సమస్యలను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తూ ఎప్పుడూ లేని విధంగా ఆరోగ్య శాఖ ను సమర్థవంతంగా నిర్వహిస్తున్న సత్య కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేస్తూ సుమారు వందమంది కి అందజేసిన ఈ కార్యక్రమంలో జిఎంఆర్ వైస్ ప్రెసిడెంట్ మరియు సత్యన్న సేన సెక్రటరీ త్రివిక్రమ్, సత్య కుమార్ మిత్రులు గంగాధర్ , ఆర్య వైశ్య సంఘ సభ్యులు అన్నం మణి కంఠ, బీజేపీ సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ కాటేపల్లి నరేష్ , బీజేపీ ఎస్సీ మోర్చా సెక్రటరీ నాగరాజు, ఎం ఈ ఎఫ్ నాయకులు పూజారి ఓబులేసు, నగేష్ లు మరియు .రమణ లు పాల్గొన్నారు

ఎనుములపల్లిలో శివపార్వతులతో కొలువుదీరిన గణనాథుడు

సర్వ దేవాది దేవా మహోత్సవ కమిటీ మండపానికి పోటెత్తిన భక్తులు

తల్లిదండ్రులే ప్రపంచమన్న సందేశంతో ఆకట్టుకుంటున్న అలంకరణ



పుట్టపర్తి, సెప్టెంబర్ 16 (సీమవార్త సాయంకాలం బ్యూరో) : పుట్టపర్తి పట్టణంలో మూడు రోజుల వినాయక వేడుకలు ముగిసి పలు మండపాల్లోని గణనాథులు బుధవారం నిమజ్జనానికి తరలివెళ్లగా, ఎనుములపల్లిలో మాత్రం వేడుకలు ఐదో రోజు వరకు కొనసాగనున్నాయి. దీంతో ఎనుములపల్లిలోని వినాయక మండపాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదుట శ్రీ సర్వ దేవాది దేవా మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాడు. కైలాస పర్వత నేపథ్యంలో శివపార్వతులతో కలిసి కొలువుదీరిన వినాయకుడి రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. రంగురంగుల విద్యుత్ దీపాలు, గెలాక్సీ బ్యాక్‌డ్రాప్‌తో మండపం కన్నుల పండుగగా కనిపిస్తోంది. తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణ చేసి మూడు లోకాలు చుట్టివచ్చిన ఫలం పొందిన వినాయకుడి కథను తలపించేలా ఈ అలంకరణ ఉందని భక్తులు చెబుతున్నారు. తల్లిదండ్రులే ప్రపంచమనే గొప్ప సందేశాన్ని ఈ మండపం స్ఫురింపజేస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, గణపతి హోమం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. అదేవిధంగా సర్వ దేవాది దేవా కమిటీ సభ్యులకు ప్రజలు అభినందనలు తెలిపారు.

శివపుత్ర యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం

గణపతి బప్పా మోరియా నినాదాలతో మార్మోగిన చింతకుంట రోడ్డు



తాడిపత్రి సెప్టెంబర్ 16 సాయంత్రం: తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లి గ్రామం లోని చింతకుంట రోడ్డులో శివపుత్ర యూనియన్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనోత్సవం కన్నుల పండుగగా సాగింది. స్థానిక యువకులంతా కలిసి ఏర్పాటు చేసిన వినాయకుడికి 3 రోజుల పాటు ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజున గణనాథుడిని అందంగా అలంకరించి డీజే, డప్పుల చప్పుళ్ల నడుమ భారీ ఊరేగింపుగా పెన్నా నది వరకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా యువకులు చేసిన కోలాటం, భక్తి నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గణపతి బప్పా మోరియా నినాదాలతో చింతకుంట రోడ్డు మార్మోగిపోయింది., భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా నిమజ్జనం పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో శివపుత్ర యూనియన్ అధ్యక్షులు, సభ్యులు, ఎర్రగుంటపల్లి, చింతకుంట గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తమ్మడేపల్లిలో మహిళలకు ముగ్గుల పోటీలు



అమరాపురం సెప్టెంబర్ 16 సీమవార్త సాయంత్రం. మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో వరసిద్ధి వినాయక ఉత్సవాలు సందర్భంగా ముగ్గుల పోటీలను వరసిద్ధి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు వరసిద్ధి వినాయక సేవా సమితి అధ్యక్షుడు హెచ్.పీ హనుమంతరాయ తెలిపారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో వినాయకునికి ప్రసాదంగా పెట్టే లడ్డును మాజీ ఎంపిటిసి చంద్రప్ప అందజేశారు. కే సిద్దేశ్వర సహకారంతో వినాయకుని విగ్రహం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ముగ్గుల పోటీ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి మహిళలకులకు మొదటి బహుమతి మరియు ద్వితీయ బహుమతులను విజేతలకు అందజేశారు. అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నటువంటి వారికి కూడా బహుమతులను అందజేసినట్లు యువత సంఘం సభ్యులు తెలిపారు. అనంతరం సాయంత్రం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు

పురంలో... మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడి కుర్తి హరి ఆధ్వర్యంలో సంబరాలు.



హిందూపురం సెప్టెంబర్ 16 సీమ వార్త సాయంత్రం. రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమం శాఖా మంత్రివర్యులు శ్రీ వై. సత్య కుమార్ యాదవ్ గారి జన్మదిన వేడుకల ను ఈ రోజు స్థానిక హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడికుర్తి హరి ఆధ్వర్యంలో, పట్టణ బిజెపి అధ్యక్షురాలు 11వ వార్డు కౌన్సిలర్ అంజలి రమేష్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు, రోగులకు బ్రెడ్లు, పండ్లను, అందించడం జరిగింది. ఈ కార్యక్రమములో సెంట్రల్ సీడ్స్ డైరెకర్, రమేష్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భాగ్యలక్ష్మి గౌడ్, మాజీ పార్లమెంటు కన్వీనర్ సీనియర్ నాయకులు రమణ మూర్తి, , బిజెపి శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. అమర దేవేంద్ర, యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రవితేజ రెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి మాజీ కౌన్సిలర్ శ్రీమతి గీతాంజలి (గీతమ్మ) ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు అర్జున్ నాయక్, ఎస్టి మోర్చా రాష్ట్ర కార్య వర్గ సభ్యురాలు లక్ష్మి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అనురాధ, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు అనిత, భారతి, రమ్య, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు సునీల్, జయకృష్ణ, నాయకులు దత్తు, రవి, వసంత, చేనేత సెల్ నాయకులు మురళి, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి రవి, ఉపాధ్యక్షులు చంద్రాయుడు, పాపన్న, కార్యదశి సుధాకర్, మరియు నాయకులు కంచిసముద్రం వేణు, నాగరాజు, ధవళేశ్వర్, మంజు, సాయి వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం



అమరాపురం సెప్టెంబర్ 15 సీమవార్త సాయంత్రం. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షణ పరిధిలో 2026-27కి సంబంధించిన ఎస్ఎంసి ఎన్నికల నోటిఫికేషన్ను బుధవారం ప్రభుత్వం విడుదల చేసినట్లు అమరాపురం పీఎం శ్రీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె. ప్రియాంక తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 18 తేదీ శుక్రవారం ఓటర్ల జాబితాను నోటీస్ బోర్డు పై పెట్టడం, ఈనెల 25వ తేదీ శుక్రవారం ఓటర్ జాబితాపై అభ్యంతరాలు తీసుకోవడం, అదేవిధంగా తుది జాబితాను ప్రకటించడం, ఈనెల 29 వ తేది మంగళవారం ఎన్నికలను ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించడం జరుగుతుందని,అదే రోజు అనగా 29వ తేదీన మధ్యాహ్నం1.30 గంటలకు చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించి2 గంటలకు ప్రమాణ స్వీకారం,3గంటలకు ఎస్ఎంసి నూతన కమిటీ సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.ఈసారి ఎస్ఎంసి కొత్త గైడ్ లైన్స్2026 ప్రకారం1. ఎంత మంది ఉండాలి?

100 లోపు పిల్లలు ఉంటే – 12 నుండి 15 మంది,
100–500 మంది ఉంటే – 15 నుండి 20 మంది,
500 పైన ఉంటే – 20 నుండి 25 మంది.

2. ఎవరు ఉండాలి?

75% తల్లిదండ్రులే ఉండాలి.మిగతా 25% లో – లోకల్ అథారిటీ (పంచాయతీ/మున్సిపల్) సభ్యులు, స్కూల్ టీచర్లు, అంగనవాడి ఆశా మరియు ఏఎన్ఎంలు,పూర్వ విద్యార్థులు. 50% మహిళలు తప్పనిసరి. ఎస్సీ ఎస్టీ ఓబీసీ మరియు సిడబ్ల్యూ ఎస్ ఎన్ పిల్లల తల్లిదండ్రులకు ప్రాధాన్యత ఇవ్వాలి.3. పదవీకాలం: 2 సంవత్సరాలు. ఒకరు వరుసగా 2 సార్లు కంటే ఎక్కువ ఉండకూడదు. తదితర నిబంధన ప్రకారం ఎస్ఎంసి ఎన్నికలను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881